సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 7 । నవంబర్ । 2023



తిరుగులేని దీక్షకు సంకేతం

ప్రజా సంకల్ప యాత్రకు తొలి అడుగు పడి ఆరేళ్లయ్యాయి. ఆ జ్ఞాపకాలను మంత్రి ధర్మాన గుర్తు చేసుకున్నారు. - IIలో



రైతన్నకు అండదండ

వైఎస్సార్ రైతు భరోసా రెండో విడత నిధులు నేడు అందనున్నాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. - IIలో

నేడు బొడ్డపాడులో రైతు కూలీ మహాసభలు

పలాస: పలాస మండలం బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక భవనం వద్ద మంగళవారం అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా 10వ మహాసభలను నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి వి.మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొత్త ఊపిరి



ఉద్దండ రాజకీయ నాయకులకు పురిటి గడ్డ ఆ ప్రాంతం. ఉరకలెత్తే రాజకీయ చైతన్యానికి చిరునామా ఆ నియోజకవర్గం. జిల్లాకు ఎందరో కీలక నాయకులను అందించిన ఆమదాలవలస ఇప్పుడు తనలో మరో కోణాన్ని ఆవిష్కరించుకుంటోంది. సరికొత్త కాలేజీలతో ఎడ్యుకేషనల్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల, అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కాలేజీ, హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ వంటి వినూత్న విద్యాలయాలు ఇక్కడ ఊపిరి పోసుకున్నాయి. ఏళ్లుగా వేధిస్తున్న ఎన్నో సమస్యలకు ఈ నాలుగున్నరేళ్లలోనే పరిష్కారాలు దొరికాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ నియోజకవర్గం చూసిన మార్పు ఇది. దీనికి తోడు రూ.2వేల కోట్ల సంక్షేమ పథకాలతో బడుగుల బతుకుల్లో చిరునవ్వులు నింపారు. ఈ మేలును వివరించడానికి నేడు నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నారు.



- ఆమదాలవలస నియోజకవర్గంలో రూ.2వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు
- ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం
- సరికొత్త కళాశాలల ఏర్పాటు
- నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : బలసలరేవుకు ఊపిరి వచ్చింది. మడ్డువలస పనులకు జీవం వచ్చింది. ఆమదాలవలస పురపాలకం అప్‌గ్రేడ్ అయ్యింది. పట్టణంతో పాటు పల్లెదారులు బాగు పడ్డాయి. కొత్తగా డిగ్రీ కాలేజీలు వచ్చాయి. వృత్తి విద్యా కోర్సుల కళాశాలలకు ఆమదాలవలస కొత్త చిరునామాగా నిలిచింది.. అంతేనా.. బడుగు వర్గాల వారికి నామినేటెడ్ పదవులు వచ్చాయి. రాజ్యాధికారంలో బలహీన వర్గాల వారి ప్రాతినిధ్యం పెరిగింది.. ఆమదాలవలస బిడ్డ శాసన సభాపతిగా సగర్వంగా సమున్నత స్థానంలో నిలుచున్నారు. నాలుగున్నరేళ్లలో ఆమదాలవలస అందుకున్న ప్రయోజనాలకు జనమే సాక్షిగా నిలిచారు. జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని వివరించేందుకు వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర ఆమదాలవలస నియోజకవర్గంలో నేడు జరగనుంది.

బడుగులకు రాజ్యాధికారం

ఆమదాలవలస నుంచి ఎందరో ఉద్దండులు కీలక పదవులను అలంకరించారు. కానీ ఎవరికీ, ఎప్పుడూ రాని అవకాశం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వచ్చింది. చరిత్రలో ఎన్నడూలేని విధంగా శాసనసభలో అత్యున్నత స్పీకర్ పదవిని తమ్మినేని సీతారాంకు ఇచ్చి సీఎం వైఎస్ జగన్ గౌరవించారు. దీంతో రాష్ట్రంలో ఆమదాలవలస నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆయనొక్కరికే కాదు నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అనేక మందికి నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ పదవులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ తదితర పదవులెన్నో వచ్చాయి.

అర్హులకు సంక్షేమం..

దాదాపు 90 శాతం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలున్న ఈ నియోజకవర్గంలో రూ.2వేల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ నాలుగున్నరేళ్లలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద నియోజకవర్గంలో రూ. 1300కోట్లను ప్రజల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. నాన్ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద ఇళ్ల స్థలాలు, గోరుముద్ద, జగనన్న తోడు రుణాలు, రేషన్, ట్యాబ్‌లు పంపిణీ, విద్యా కానుక, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసమని మరో రూ. 650కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేసింది. నాడు-నేడుతో బడులు బాగుపడ్డాయి.



ఆమదాలవలస మండలం ఇసుకలపేట వద్ద నాగావళి నదిపై నిర్మిస్తున్న బలసలరేవు వంతెన

దీనికి తోడుగా ఊరూరా కొత్తగా వెలసిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, వెటర్నరీ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు కొత్త వైభవాన్ని తీసుకువచ్చాయి.

ప్రగతి పనుల్లో కొన్ని..

- వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు.
- తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు.
- పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు.
- పొందూరులో డిగ్రీ కళాశాల.
- తొగరాంలో డిగ్రీ కళాశాల .
- పొందూరులో ఎంజేపీ స్కూల్.
- ఆమదావలస జగ్గుశాస్త్రులపేట వద్ద క్రికెట్ స్టేడియం.
- పొందూరులో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల.
- బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనులకు రూ. 87కోట్లు మంజూరు.
- ఆమదాలవలసలో నాలుగు రోడ్లకు రూ.43కోట్లు మంజూరు.
- మడ్డువలస రెండో దశ పనులకు రూ.26.90కోట్లు మంజూరు.
- ఆమదాలవలస రూరల్‌లో ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియం మంజూరు.
- నియోజకవర్గవ్యాప్తంగా మూడువేల ఇళ్ల కేటాయింపు.
- జల్‌జీవన్ మిషన్ ద్వారా ఆమదాలవలస నియోజకవర్గంలో రూ. 220కోట్లతో ఇంటింటికి మంచి నీటి కుళాయిల ఏర్పాటు.
- ఆమదాలవలసలో రూ. 70లక్షలతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం.



ఆమదాలవలస మండలం తొగరాం గ్రామంలో గల ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

- నియోజకవర్గంలో 12ఎత్తిపోతల పథకాల నిర్మాణం.
- అలికాం నుంచి సరుబుజ్జిలి మధ్య రూ. 2కోట్లతో రోడ్డు పనులు.
- ఆమదాలవలస నుంచి పాలకొండ మధ్య రూ. 3.50కోట్లతో రోడ్డు పనులు.
- గ్రేడ్ 2 మున్సిపాలిటీగా ఆమదాలవలస అప్‌గ్రేడ్.
- నాగావళి-వంశధార నదుల అనుసంధానానికి ప్రణాళిక.

గతమంతా దౌర్జన్య కాండ

టీడీపీ హయాంలో నియోజకవర్గంలో జన్మభూమి కమిటీల అరాచకమే రాజ్యమేలింది. లంచాలు తీసుకుని, పచ్చ చొక్కాలు వేసుకున్న వారికి మాత్రమే కాస్తకూస్తో పథకాలు అందశారు. ఇక ఇసుక దోపిడీ, నీరు చెట్టు దోపిడీ, నాసిరకం రోడ్ల పనులతో టీడీపీ హయామంతా అవినీతి మయమైపోయింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇప్పటికీ ఆ దౌర్జన్యాలనే నమ్ముకున్నారు. ఎంపీడీఓలను, ఈఓపీఆర్‌డీలను, తహసీల్దార్లను, పోలీసు అధికారులను చంపేస్తామని బెదిరించడం, బూతులు తిట్టడం, గొడవలకు దిగడం వంటివి చేస్తున్నారు. అధికారం లేనప్పుడే ఇలా ఉంటే.. చేతికి అధికార వస్తే సామాన్య ప్రజలను బతకనిస్తారా అన్న ఆందోళన స్థానికుల్లో ఉంది.

బడుగు బలహీన వర్గాల వారు అందుకున్న సంక్షేమాల్లో కొన్ని..

పథకం పేరు	ఆమదాలవలస మున్సిపాలిటీ/మండలం లబ్ధిదారులు- సొమ్ము(రూ.ల్లో)	పొందూరు లబ్ధిదారులు- సొమ్ము	సరుబుజ్జిలి లబ్ధిదారులు-సొమ్ము	బూర్జ లబ్ధిదారులు-సొమ్ము
ఆసరా	15,160-36,34,14,894	14,354-33,84,19,786	6,049-11,84,11,988	8,871-12,39,43,266
చేదోడు	808-2,59,20,000	651-2,38,30,000	227-45,97,000	552-95,80,000
జగనన్న వసతి దీవెన	5,499-61,10,4920	5548-7,98,48,343	2235-2,47,53,634	3059-2,79,06,273
జగనన్న విద్యాదీవెన	4934-9,85,76,352	6109-10,32,66,507	2557-4,45,26,030	3520-4,68,55,736
వాహన మిత్ర	650-3,02,90,000	672-2,16,21,000	352-1,19,00,000	456-1,32,70,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	2,703-104612350	3782-14,19,27,364	1310-4,61,16,597	2125-6,10,33,342
వైఎస్సార్ చేయూత	6,481-51,43,87500	6354-25,49,62,500	3076-13,64,81,250	4121-23,95,31,250

యాత్ర సాగుతుందిలా..

ఆమదాలవలస: సామాజిక సాధికార యాత్రలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు శ్రీకాకుళం రూరల్ మండలం వాకలవలస వద్ద ఆంజనేయ స్వామి కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గేటు మున్సిపల్ హైస్కూల్‌లో నాడు-నేడు నిర్మాణాలు పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆమదాలవలస వైఎస్సార్ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆమదాలవలస పట్టణంలోని కోర్టు ఎదురుగా ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుని సభ నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

15న నరసన్నపేటలో సామాజిక సాధికార యాత్ర



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నరసన్నపేటలో ఈ నెల 15న సాయంత్రం సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. యాత్రకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పెద్దలు వైవీ సుబ్బారెడ్డి, స్పీకర్ త మ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులు ముఖ్య అతిథులుగా వస్తారని పేర్కొన్నారు.


కిడ్నీ ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధం



పరికరాలు పరిశీలిస్తున్న సత్యప్రభాకర్, ఉన్నత స్థాయి వైద్యాధికారులు

కాశీబుగ్గ: కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధమైందని ఏపీఎంఎస్ఐడీసీ శ్రీకాకుళం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్ తెలిపారు. ఆయన సోమవారం ఆస్పత్రిలోని అన్ని గదులను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రికి ఇప్పటికే ప్రభుత్వం వైద్యులు సాంకేతిక ఇతర సిబ్బందిని నియమించిందని తెలిపారు. నవంబర్ 23న సీఎం వైఎస్ జగన్ ఆస్పత్రిని ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.త్రిమూర్తులు, పలాస కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 320 వినతులు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 320 వినతులు అందాయి. ఈ వినతులను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సూచించారు. ఆయనతోపాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ జి.జయదేవి వినతులు స్వీకరించారు. స్పందనలో వచ్చిన అర్జీలకు, అర్జీల గడువును బట్టి 24గంటల నుంచి ఐదు రోజుల్లోగా పరిష్కరించాలన్నారు.

ఎస్పీ స్పందనకు 30 అర్జీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 30 వినతులు అందాయి. ఈ ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ (ట్రైనీ) రాఘవేంద్ర మీనా, అడిషనల్ ఎస్పీ జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి పోటీలు



బహుమతులు అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

గార: వమరవల్లి డైట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పాపులేషన్ ఎడ్యుకేషన్ అనే అంశంపై ఫోక్ డ్యాన్సు, రోల్‌ప్లే పై పోటీలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా నుంచి పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా ఫోక్‌డ్యాన్సులో వమరవల్లి గురుకులం, జీహెచ్ఎస్ బాయ్స్, శ్రీకాకుళం, గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలవగా, రోల్‌ప్లేలో సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వమరవల్లి గురుకులం, కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలిచారు. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ గార పగడాలమ్మలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.తిరుమల చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ, జీవీ రమణ, జి.లీలామోహన్‌బాబు, నాయుడు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమరశంఖం పూరించండి

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు సమర శంఖం పూరించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సామాజిక సాధికార విప్లవం నడుస్తోందన్నారు. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు అన్ని వర్గాల వారు ఉవ్విళ్లూరుతున్నారని తెలిపారు. ఆమదాలవలసలో మంగళవారం సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు గతంలో రాష్ట్రాన్ని రాబందులా దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. ఆయన దాదాపు 19 కేసులపై విచారణ జరగకుండా స్టే తెచ్చుకున్నారని, 14 ఏళ్లుగా ప్రజల సొమ్ము దోపిడీ చేసి మళ్లీ సిగ్గులేకుండా ప్రజల్లోకి వస్తున్నారని గుర్తుచేశారు. ప్రజలు దీన్ని గమనించాలన్నారు. రాష్ట్రానికి అభివృద్ధి చేసే సీఎం వైఎస్ జగన్ అని, ఆయనను ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దుంపల శ్యామలరావు, ముత్తా విజయ్, సనపల మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .



విలేకరులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

యాత్రను విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: పలాసలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేసిన వారికి మంత్రి సీదిరి అప్పలరాజు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో పలాసలో రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. వాటిని అందరి ముందు గుర్తు చేసుకునే అవకాశం కలిగిందన్నారు. మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నుంచి అధిక మొత్తంలో ప్రజలు హాజరు కావడం ఎనలేని సంతోషాన్నిచ్చిందన్నారు. ఈనెల 9న పలాసలో నిర్వహించనున్న వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సైతం విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 23వ తేదీన సీఎం వైఎస్ జగన్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభానికి విచ్చేస్తున్నారని, మరింత ఉత్సాహంతో విజయవంతం చేయాలని కోరారు.

ఇకపై 'డాక్టర్ వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు'



ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం ప్రభుత్వం రూ.700 కోట్లతో నిర్మించిన ఉద్దాన మంచినీటి పథకానికి 'డాక్టర్ వైఎస్సార్ సుజల ధార ప్రాజెక్టు'గా నామకరణం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ తరపున జీఓ నంబర్ 85ను సోమవారం విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా హిరమండలం నుంచి 105 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు మంచినీరు వస్తుంది. వైఎస్సార్ హయాంలో హిరమండలం వంశధార ప్రాజెక్టు పూర్తయ్యింది. అక్కడి నుంచి నీటిని ఉద్దాన కిడ్నీ బాధితులకు తరలిస్తుండటంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

-కాశీబుగ్గ

'స్వామిత్వ'తో శాశ్వత భూహక్కు



అరసవల్లి: గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కులను ఖరారు చేసేందుకు ఉద్దేశించిన సర్వే ఆఫ్ విలేజీ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రోవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజి ఏరియాస్ (స్వామిత్వ) కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు శాశ్వత భూహక్కు పత్రాలు అందుతాయని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ తెలియజేసారు. జిల్లాలో 2020 అక్టోబర్ 11న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, జిల్లాలో 599 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికి 140 గ్రామాల్లో ఇంటింటి సర్వే పూర్తి చేయించామని వివరించారు. పంచాయతీ సర్వే అధికారులు ప్రజల వద్దకు వచ్చినప్పుడు ప్రజలు తమ వద్దనున్న ఆస్తి పత్రాల నకళ్లను అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్ (పీపీఎం) నందు లబ్ధిదారులకు జారీ చేసి ఆస్తి యాజమాన్య హక్కు కల్పిస్తామని డీపీఓ రవికుమార్ తెలిపారు.

ఉన్నత విద్య సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని ఉన్నత విద్యను స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య అన్నారు. పరిపాలన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పీజీసెట్-2023 రెండో విడత కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభమైందని అన్నారు. పీజీసెట్‌లో ర్యాంకు వచ్చి సీటు రాని విద్యార్థులు, కోర్సు, కళాశాలలు మార్పు కోరుకునే విద్యార్థులు, గతంలో ర్యాంకు వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 8 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ, 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 18న సీట్ల అలాట్ మెంట్, అనంతరం సీట్లు వచ్చిన విద్యార్థులు 20 నుంచి 23వ తేదీ వరకు కళాశాలకు రిపోర్టు చేయాల్సి ఉంటుందని అన్నారు.

5216 మందికి మెరుగైన వైద్యం కోసం సిఫార్సు



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా 5216 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్టు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. డీఎంహెచ్‌ఓ, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు వైద్య ఆరోగ్య సిబ్బందితో సోమవారం సాయంత్రం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా 2,22,084 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారిలో 5,216 మందిని మెరుగైన వైద్యం కోసం వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. వారిని నవంబర్ 30వ తేదీ లోపు ఆయా ఆస్పత్రులకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించే బాధ్యతను సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రిఫరల్ కోసం రోగులకు ప్రయాణ ఖర్చుల కింద రూ.500 చొప్పున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రిఫరల్ కోసం వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రోగం నయం చేసేంత వరకు ఉచితంగా మందులు అందించాలని అన్నారు. ఆరోగ్య మిత్రల సహకారంతో వెంట వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన చేపట్టాల ని అన్నారు. జనవరి ఒకటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కూడా ప్రారంభమవుతుందని వివరించారు. డీఎంహెచ్ఓ బి.మీనాక్షి మాట్లాడుతూ రిఫరల్ పేషెంట్లకు వైద్యం అందించే ప్రక్రియలో జాప్యం ఉండకూడదన్నారు.

9న కారా మాస్టారు శతజయంతి ఆరంభ సభ



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న కాళీపట్నం రామారావు మాస్టారు శత జయంతి ఆరంభ సభ కార్యక్రమం కథా నిలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా అట్టాడ అప్పలనాయుడు, ముఖ్య అతిథిగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

క్లుప్తంగా

9న శ్రీరామ విజయోత్సవ శోభాయాత్ర



గ్రౌండ్‌లో జరిగే ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహక కమిటీ

శ్రీకాకుళం కల్చరల్: అయోధ్య రామాలయం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో శ్రీకాకుళం నారాయణ తిరుమల ఆధ్వర్యంలో శ్రీరామ విజయోత్సవ శోభాయాత్రను ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు విశాఖకు చెందిన పాంచరాత్రి ఆగమ పండితులు శేషాచార్యులు తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, తగు సూచనలు, సలహాలు కమిటీకి సోమవారం తెలియజేశారు.ఈ విజయోత్సవ యాత్ర నారాయణ తిరుమల నుంచి 3గంటలకు బయల్దేరుతుందని, ఇందులో హరిసంకీర్తన బృందాలు, కోలాటాల బృందాలు, చెక్క భజనలు ఉంటాయన్నారు. ఈ శోభాయాత్ర ఏడురోడ్ల కూడలి వద్ద మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ వరకు సాగుతుందని తెలిపారు. అయోధ్య శ్రీరాముని పాదుకలు కూడా భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేస్తున్నామని, అందరూ వచ్చి దర్శించుకొని తరించాలని కోరారు. అలాగే 2వేల జంటలతో సీతారాముల కల్యాణ వేడుకలు జరుగుతాయని, భద్రాచలం, రామతీర్థాలు వంటి వివిధ క్షేత్రాల నుంచి పండితులు, స్వాములు హాజరవుతారని నారాయణ తిరుమల ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. ఆధ్యాత్మిక వైభవం గోచరించే విధంగా రూ.12లక్షలతో ఆలయ సెట్ వేదికను రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు పేర్ల సాంబమూర్తి, నటుకుల మోహన్, శారద, కృష్ణమోహన్, శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



పల్లవిని అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎం పురం క్యాంపస్ ప్రీ యూనివర్సిటీ కోర్సు మొదటి సంవత్సరం విద్యార్థిని పీహెచ్ పల్లవి ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలో బంగారు పతకం సాధించింది. జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు అర్హత సాధించింది. ఈ నెల 19న జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొననుంది. దీంతో ఎస్ఎంపురం క్యాంపస్‌లో శ్రీకాకుళం డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. ట్రిపుల్ ఐటీలో క్రీడాకారులకు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ శిక్షకులు రాజు, దిలీప్ కుమార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్. సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహనకృష్ణ పాల్గొన్నారు.

తప్పిన ముప్పు



డివైడర్‌పైకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

ఎచ్చెర్ల క్యాంపస్: విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు సోమవారం ఎచ్చెర్ల సమీపంలోని పాత జాతీయ రహదారిపై డివైడర్‌పైకి దూసుకుపోయింది. బస్సు స్టీరింగ్ పట్టేయటంతో అదుపు తప్పినట్లు సమాచారం. అయితే ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. అనంతరం క్రేన్ సాయంతో బస్సును తొలగించి కాంప్లెక్సుకు తరలించారు. బస్సు కింద భాగం డివైడర్‌కు తాకటంతో దెబ్బ తింది. ప్రయాణికులను వేరే బస్సులో కాంప్లెక్స్‌కు తీసుకువెళ్లారు.

ప్రజా సంకల్పం

తిరుగులేని దీక్షకు సంకేతం



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దేశమంతా మెచ్చేలా వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలన సాగిందని, ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా 98 శాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సీఎం వైఎస్ జగన్ తిరుగులేని దీక్షకు ప్రజా సంకల్ప యాత్ర ఓ సంకేతమన్నారు. యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ టౌన్ హాల్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు.

ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ పాదయాత్రలో గుర్తించిన అంశాలను పరిష్కరిస్తూ నీతివంతంగా పాలన సాగిస్తున్నామన్నారు. గతంలో నాయకులు కార్యకర్తల సంక్షేమం మాత్రమే చూసి మిగిలిన వర్గాలకు మొండి చేయి



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

చూపించేవారన్నారు. ఈ రోజు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వివక్షకు తావే లేకుండా పాలన సాగిస్తోందని చెప్పారు.

పథకాలు రాజ్యాంగం ఇచ్చిన హక్కు

సంక్షేమ పథకాలు రాజ్యాంగం జనాలకు ఇచ్చిన హక్కు అని ధర్మాన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ఏర్పాటైన ప్రభుత్వాలకు అర్హులైన అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్య్ర భారతంలో వైఎస్సార్ తర్వాత సీఎం వైఎస్ జగన్ మాత్రమే ఆ పనిచేసి చూపిస్తున్నారని అన్నారు. ఆ రోజు తమ పార్టీకి ఓటు వేయని వారు కూడా ఈ రోజు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం లేదనే అంశం గ్రామాల్లోకి వెళ్లినప్పుడు తెలిసిందన్నారు. రూ 2.3 లక్షల కోట్లు డీబీటీ ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అందజేశామన్నారు. లబ్ధిదారుల ఆత్మ గౌరవం దెబ్బతినకుండా పథకాలు వర్తింపజేశామని చెప్పారు. పాదయాత్రలో ఏడాదిన్నర పాటు వైఎస్ జగన్ శక్తి వంచన లేకుండా రాష్ట్రం మొత్తం తిరిగారని చెప్పారు. ప్రజల కష్టాలు చూసి అప్పటి నుంచి సమాజాన్ని మార్చాలన్న దృఢ సంకల్పంతో పనిచేశారని తెలిపారు. పాదయాత్ర వల్లే సీఎం వైఎస్ జగన్ గొప్ప సీఎంగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు.

వెనక్కి తగ్గలేదు..

రెండేళ్లు కరోనాతో యుద్ధం చేశామని, దేశంలో అందరి కంటే బాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గొప్పగా చేసిందని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య ఆరోగ్య సేవలను చేరువ చేయగలిగామన్నారు. ఈ నాలుగేళ్లలో సమూల మార్పులు తీసుకువచ్చామన్నారు.

సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, కళింగవైశ్య, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, డీపీ దేవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, శిమ్మ రాజశేఖర్, అంబటి శ్రీను, సాధు వైకుంఠరావు, చౌదరి సతీష్, పాలకొండ అప్పారావు, పీస గోపి, పొన్నాడ రుషి, ఎన్ని ధనుంజయరావు, కోనాగ నర్సింగరావు, రుప్ప శేషగిరి, ఎండ రమేష్, చల్ల అలివేలుమంగ, చింతాడ మంజులతో పాటు అధిక సంఖ్యలో శ్రీకాకుళం, గార, రూరల్ మండల నాయకులు పాల్గొన్నారు.

గుండె చికిత్స కోసం రూ.1.18 లక్షలు ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన భద్రాచలం తారకేశ్వరరావు గుండెకు సంబంధించి వ్యాధితో బాధ పడుతుండడంతో సోమవారం అతనికి గ్రామస్తులు రూ.1.18 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఆయనకు గుండెలో సీఆర్‌టీ అనే పరికరం అమర్చితేనే బతికే చాన్సు ఉందని వైద్యులు చెప్పారు. రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని వారు చెప్పడంతో పెద్దమురహరిపురం డెవలప్‌మెంట్ ఫోరం(పీడీఎఫ్) స్పందించింది. గ్రామంలోని ఉద్యోగులు, సైనిక సేవా సమితి నుంచి సైనికులు, మాజీ సైనికులు, విదేశాల్లో ఉన్నవారు, గ్రామస్తుల సహకారంతో విరాళాలు సేకరించి రూ.1,18,000 నగదును తారకేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో పీడీఎఫ్ ప్రతినిధులు పి.తిరుపతిరావు, కె.సింహాచలం, ఇ.శ్రీనివాసరావు, చిన్నారావు, స్థానిక సర్పంచ్



తారకేశ్వర రావుకు సాయం అందజేస్తున్న పీడీఎఫ్ ప్రతినిధులు, గ్రామస్తులు

జి.వసంతరావు, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కె.గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు వసంతరావు, గ్రామ పెద్ద లోకరాజు, మాజీ ఎంపీటీసీ దానేష్, ఎన్. గణేష్, సైనిక సేవా సమితి ప్రతినిధులు పి.లోకనాథం, టి.మురళి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

శ్రీకాకుళం రూరల్ : మండల పరిధిలో గల పెద్దపాడు అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి తరగతి గదులను, వసతి గదులను పరిశీలించడమే కాక సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని, ఉన్నత ఆశయాల దిశగా ముందుకు సాగాలని, ఆటల్లో ప్రావీణ్యం చూపించాలని సూచించారు. పోక్సో, దిశ వంటి మహిళా చట్టాలపై అవగాహన ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలని, అవాంఛనీయ ఘటనలు ఎదురైనప్పుడు పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎస్పీ రాధిక

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని బలగ మెట్టు శివాలయం రోడ్డు సమీపంలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లగేజీ వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆ వ్యక్తి గాయపడినట్లు ట్రాఫిక్ ఎస్ఐ జె.రామారావు పేర్కొన్నారు. బూర్జ మండలం గుత్తావల్లికి చెందిన పైడి వెంకటరమణ (55) నగరంలోని పీఎన్ కాలనీలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లడానికి స్కూటీపై వస్తుండగా మార్గం మధ్యలో టాటా ఏసీ లగేజీవ్యాను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో తీవ్రంగా గాయాలయ్యాయి. అయితే ప్రమాదం జరిగాక వ్యాన్ డ్రైవర్ ఆపకుండా పరారైపోయాడు. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

రైతుపై గుర్తు తెలియని జంతువు దాడి

మందస: మండలంలోని మూలిపాడు గ్రామానికి చెందిన తిరుమరెడ్డి మోహనరావు అనే రైతుపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని జంతువు దాడి చేసింది. మోహనరావు పొలానికి నీరు పెట్టడానికి వెళ్తుండగా లచ్చయ్య చెరువు వద్ద చిరుత పులి ఆకారంలో ఉన్న జంతువు దాడి చేయడంతో గాయపడ్డాడు. దీంతో స్థానికులు ఆయనను హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు చికిత్స చేసి, ప్రమాదం లేదని చెప్పారు. దాడి చేసిన జంతువు అడవిపిల్లిగా అనుమానిస్తున్నారు. దీన్ని ఈ ప్రాంతంలో చిట్టెడుపులి అంటారని అటవీ శాఖాధికారులు చెప్పారు. దీనిపై సమాచారం అందుకున్న కాశీబుగ్గ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణ నాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము, ఫారెస్ట్ సెక్షన్ అధికారి డీవీరెడ్డి, బీట్ అధికారులు తూలుగు వెంకటేశ్వరరావు, మల్లి



గాయపడిన మోహనరావు నుంచి వివరాలు సేకరిస్తున్న అటవీశాఖాధికారులు

పురం పోలయ్య, రత్నాల వినీల, సతివాడ దుర్గాదేవి, అమెరెప్ప బాబురావు, రాణా సంతోష్‌కుమార్, టైగర్‌స్క్వాడ్ బృందం హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి చేరుకున్నారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. రెండు రోజుల కిందట మూలిపాడు ప్రాంతంలో పెద్దపులి సంచరించడంతో ఆ కోణంలో దర్యాప్తు చేశారు. మోహనరావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం అడవిపిల్లి/పెద్దబావురుపిల్లి అయి ఉంటుందని రేంజ్ అధికారి మురళీకృష్ణనాయుడు చెప్పారు. దాడి చేసింది పెద్దపులి కాదని స్పష్టం చేశారు. ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని కొండములగాం పంచాయతీలో గల ముక్తుంపురం గ్రామానికి చెందిన కాకి రమణ(27) ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని జేఆర్ పురం పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాకి రమణకు, చీపురుపల్లి మండలంలోని అకులుములగాం గ్రామానికి చెందిన భవానీతో రెండేళ్ల కిందట పెళ్లయ్యింది. ఇరువురికీ మనస్పర్థలు ఏర్పడడంతో ఏడాదిగా వేరువేరుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మానసికంగా ఆందోళన చెందిన రమణ ఆదివారం రాత్రి ముక్తుంపురంలో తన ఇంటి సమీపంలోని గొర్రెల పాకలో ఉరివేసుకున్నాడు. సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులు చూసి కన్నీరుమున్నీరయ్యారు. తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-19 కార్యదర్శిగా బీవీ రమణ



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్-19(ఇంటర్మీడియెట్) కార్యదర్శిగా బడి వెంకట రమణను నియమించారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్య జిల్లా వృత్తి విద్యాధికారి కోట ప్రకాశరావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.రామన్న స్థానంలో బీవీ రమణ పనిచేస్తారు. లావేరు మండలంలోని అదపాక జెడ్పీహెచ్‌స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బీవీ రమణ గత ఏడాది నుంచి జిల్లా పాఠశాల విద్య ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా విశేషంగా సేవలు అందిస్తున్నారు. గణనీయమైన ప్రగతిని, ఫలితాలను సాధిస్తున్నారు. ఈయన నియామకంపై ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ పి.దుర్గారావు, డీఈవో కె.వెంకటేశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు తదితరులు అభినందించారు.

'ఆసరా' పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్‌నెస్ (ఆసరా) ఆధ్వర్యంలో ఈ నెల 24న న్యూఢిల్లీ కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో జరగనున్న జాతీయస్థాయి వినియోగదారుల హక్కుల అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, బ్రోచర్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆసరా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. గంజి ఎజ్రా, జి.ఇందిరాప్రసాద్, కె.వేణుగోపాల్ వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ, కద్దాల శ్యామసుందర్, కె.పి.శారది, లఖినేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

నరసన్నపేట, గార: మండలంలోని వీఎన్ పురానికి చెందిన చోడి రమణ (40) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న రమణను వారం కిందట కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్చారు. ఒక రోజు చికిత్స అనంతరం ఆయన కనిపించలేదు. కుటుంబ సభ్యులు మూడు రోజులుగా అన్ని చోట్లా వెతుకుతున్నారు. ఇంతలో గార మండలం బలరాంపురం పంచాయతీ శ్రీకూర్మనాథపురంలోని రెల్లివీధిలో ఓ వ్యక్తి ఫిట్స్‌తో పడిపోయారని వీరికి సమాచారం వచ్చింది. అక్కడకు వెళ్లి చూసేసరికి ఆయన కనిపించలేదు. ఆ తర్వాత సాగునీటి కాలువలో ఒకరి మృతదేహం స్థానికులకు కనిపించగా అతడిని చోడి రమణగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు చెప్పారు. ఫిట్స్ వచ్చి నీటిలో పడి మృతి చెంది ఉంటారని భార్య సంధ్యారాణి, కుమారులు దుర్గారావు, సంతోష్ తెలిపారు. రమణ మృతితో వీఎన్ పురంలో విషాదం అలుముకుంది. మృతదేహానికి సోమవారం రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తీసుకువచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు. రమణ మృతికి సర్పంచ్ పుట్టా ఆదిలక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. భార్య సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు.



చోడి రమణ (ఫైల్)

రైలు ఢీకొని మహిళ మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లో సోమవారం డీఎంయూ పాసింజర్ ఢీకొని ఎ.లీలారాణి(47) అనే మహిళ మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఆమదాలవలస పట్టణం చంద్రయ్యపేటకు చెందిన లీలారాణి ఉదయం 6:20 గంటల సమయంలో విశాఖ వెళ్లేందుకు స్టేషన్‌కు వచ్చారు. రైలు ఎక్కేందుకు ట్రాక్ దాటి వెళ్లాలనే ప్రయత్నంలో పాసింజర్ రైలును గమనించకపోవడంతో అదే రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలికి వినోద్‌కుమార్, శ్రావణ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త గజపతిరావు అక్కలపేట పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.



ఎ.లీలారాణి (ఫైల్)

రైతన్నకు అండదండ

- నేడు వైఎస్సార్ రైతు భరోసా రెండో విడత నగదు విడుదల
- 3.21లక్షల మందికి లబ్ధి



జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఈ ఏడాది రెండో విడత 3.21లక్షల మందికి రైతులకు గాను రూ.132.41కోట్లు అందించనున్నట్లు వ్యవసాయ జిల్లా అధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి ఆర్థిక సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.13,500 ఆర్థిక సాయం చేస్తున్నాయని పేర్కొన్నారు. సొంత భూమిలేని ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వర్గాలకు చెందిన కౌలు రైతులకు (సిసిఆర్‌సి పత్రాలు కలిగిన వారికి), ఆర్ఓఎఫ్ఆర్ పట్టా కలిగిన రైతులకు పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.13500 ఆర్థిక సాయం చేస్తోందని తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళా మందిర్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● సొగసు చూడ తరమా..



ఎర్ర రంగు పూసుకున్న ఆకాశంలో నల్లటి మబ్బులు సరికొత్త అందాలను ఆవిష్కరించాయి. అక్కుపల్లి శివసాగర్ తీరం వద్ద సోమవారం కనిపించిన ఈ దృశ్యం చూపరులను కట్టి పడేసింది.
- వజ్రపుకొత్తూరు రూరల్

ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్‌లో అద్వితీయ ప్రతిభ

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ పోటీల్లో విజేతగా బాలుర విభాగంలో వైఎస్సార్ కడప జిల్లా జట్టు, బాలికల విభాగంలో విజయనగరం జట్టు జయకేతనం ఎగురవేశాయి. 67వ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ.. క్రీడాకారులు తమకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువుపైనా దృష్టి సారిస్తే జీవితంలో విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల రాష్ట్ర పరిశీలకుడు జగదీశ్వర రెడ్డి మాట్లాడుతూ.. పోటీలకు ప్రకాశం జిల్లా ఆతిథ్యం బాగుందని కితాబిచ్చారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆకర్షణీయమైన క్రీడా దుస్తులు, ట్రోఫీలు అందించిందని, తద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యమేంటో స్పష్టమైందన్నారు. సాఫ్ట్‌బాల్ అంతర్‌జిల్లాల నిర్వాహక కార్యదర్శి శివశంకరరావు మాట్లాడుతూ.. క్రీడాకారులు, కోచ్‌లకు భోజన సదుపాయం కల్పించేందుకు విద్యాశాఖ రూ.3 లక్షలు వెచ్చించడం అభినందనీయమంటూ డీఈఓ వీఎస్ సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఈటీ సంఘ కార్యదర్శులు నత్తల కృష్ణ, వై.శీనయ్య, పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

పోటీల విజేతలు వీరే..

బాలుర విభాగం : వైఎస్సార్ కడప(ప్రథమ స్థానం), శ్రీకాకుళం(ద్వితీయ), విజయనగరం(తృతీయ)
బాలికల విభాగం : విజయనగరం(ప్రథమస్థానం), వైఎస్సార్ కడప(ద్వితీయ స్థానం), ప్రకాశం(తృతీయ)

అండర్-17 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్ల ఖరారు

ఒంగోలు: అండర్-17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. పరిశీలకులు జగదీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యన్నారాయణ (విజయనగరం), కె.గోపాల్‌రెడ్డి (అనంతపురం), కృష్ణకుమార్(కృష్ణాజిల్లా) ఈ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయి.

బాలుర రాష్ట్ర జట్టు: వై.లక్ష్మీ ప్రసన్న, ఎం.యశ్వంత్ (శ్రీకాకుళం), కె.ఆంజనేయులు (వైఎస్సార్ కడప), ఎస్.మధుసూదనరావు (శ్రీకాకుళం), పి.జనార్దన్‌రావు (విజయనగరం), ఎం.మనోజ్ (వైఎస్సార్ కడప), డి.రాఘవ (విజయనగరం), పి.మహీధర్ (వైఎస్సార్ కడప), బి.నారాయణస్వామి (అనంతపురం), బి.మహేష్ (పశ్చిమ గోదావరి), ఎం.ఆకాష్ (గుంటూరు), పి.యశ్వంత్(పశ్చిమగోదావరి), టి.నాగేంద్ర (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), పి.హరీష్‌సాయి (ప్రకాశం), బి.లక్ష్మణ్ స్వామి(విశాఖపట్నం), సీహెచ్ పీటర్ (ప్రకాశం), స్టాండ్‌బైలుగా ఎ.కార్తీక్ (గుంటూరు), కె.శశి (అనంతపురం), కె.హేమంత్ కుమార్ (కృష్ణా), డి.నవీన్ (వైఎస్సార్ కడప), కె.రోహిత్ (విజయనగరం).

బాలికల జట్టు:
టి.ప్రశాంతి (విజయనగరం), ఎం.వీరనారాణమ్మ (వైఎస్సార్ కడప), సీహెచ్ అనిత (గుంటూరు), బి.సుప్రియ (విజయనగరం), ఎస్.నల్మ (ప్రకాశం), ఎం.శివ నాగలక్ష్మి (ప్రకాశం), పి.హైమావతి (విజయనగరం), ఎన్.బేబి (ప్రకాశం), జి.సునందిని(గుంటూరు), బి.నవ్యశ్రీ (కర్నూలు), కె.రాజేశ్వరి (అనంతపురం), జె.సంజన చౌదరి (ప్రకాశం), వి.యవంతిక(ప్రకాశం), కె.రిషిత (కృష్ణా), పి.రేణుక (శ్రీకాకుళం), ఎస్.భువనేశ్వరి (తూర్పు గోదావరి), స్టాండ్‌బైలుగా టి.కీర్తన (ప్రకాశం), పి.చైతన్య కుమారి (విజయనగరం), కె.రోజా (గుంటూరు), జి.నీల (విశాఖపట్నం), టి.సుకన్య (అనంతపురం).